www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 1 సెప్టెంబర్ 2023

5

ఏలూరు



నాడు - నేడు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

ఏలూరు: జిల్లాలో నాడు-నేడు పథకంలో పాఠశాలల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఎపి విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, మునిసిపల్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ తదితర అధికారులతో మనబడి నాడు-నేడు రెండో దశ పనుల పురోగతిపై జెసి సమీక్షించారు. ఈ సమీక్షలో పనుల పురోగతికి సంబంధించి పెండింగ్ పనులపై జెసి ఆరా తీశారు. ఇప్పటివరకూ పూర్తయిన పనుల వివరాలు, ఇప్పటి వరకూ ప్రారంభించని పనులు, బడ్జెట్, ఎం బుక్ నమోదు తదితరఅంశాలపై సమీక్షించారు. అధికారులు రోజువారీ మోనటరింగ్ చేసి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారుల సమన్వయంతో పనుల ప్రగతిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి వచ్చేనెలాఖరుకు పూర్తిచేయాలని, దీనికి సంబంధించిన ప్రణాళికను రూపొందించి వచ్చే సమావేశంలో సమర్పించాలని జెసి ఆదేశించారు.

నా'నో'..!



నానో యూరియాపై రైతులు విముఖత

సొసైటీ, రైతుభరోసా కేంద్రాల్లో బలవంతంగా అంటగట్టేందుకు యత్నం

ఎరువుల సబ్సిడీ నుంచి తప్పుకునేందుకు మోడీ సర్కార్ కుట్ర

శాస్త్రీయంగా నిరూపణ కాకుండానే మార్కెట్‌లోకి

రెండేళ్లలో జిల్లాలో 7,070 నానో బాటిల్స్ మాత్రమే కొనుగోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు అందిస్తున్న ఎరువుల సబ్సిడీ నుంచి తప్పుకునేందుకు కేంద్రం కుటిల యత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే శాస్త్రీయంగా నిరూపణ కాని నానో యూరియాను రైతులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను గుడ్డిగా సమర్ధిస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. నానో యూరియా సక్రమంగా పనిచేయడం లేదంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయ రంగంలో యూరియా వాడకానికి ప్రత్యేకత ఉంది. జిల్లాలో అత్యధికంగా వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, పొగాకు వంటి పంటలను రైతులు సాగుచేస్తున్నారు. యూరియా వాడకం జిల్లాలో పెద్దఎత్తున ఉంటుంది. యూరియా ఎరువు పలుకులుగా ఉంటుంది. 45 కిలోల బస్తా ఖరీదు రూ.266 వరకూ ఉంది. యూరియాను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తూ ఉంటుంది. మోడీ సర్కార్ వచ్చాక కాంప్లెక్స్ ఎరువుల ధరలను విపరీతంగా పెంచింది. యూరియా సబ్సిడీని ఎత్తివేస్తే రైతులనుంచి వ్యతిరేకత వస్తుందని భావించి, నానో యూరియాను తెరపైకి తెచ్చింది. ఇది లిక్విడ్ రూపంలో ఉంటుంది. యూరియాను రైతులు ఖరీఫ్‌లో ఎకరాకు బస్తాన, దాళ్వాకు మూడుబస్తాల వరకూ వాడతారు. పంట ఏపుగా పెరగడానికి యూరియా ఎరువు కీలక పాత్ర పోషిస్తోంది. యూరియా స్థానంలో బస్తాకు 500 మిల్లీలీటర్లు చొప్పున నానో యూరియా వాడేవిధంగా రూపొందించినట్లు చెబుతున్నారు. నానో యూరియా అరలీటర్ ఖరీదు రూ.240 వరకూ ఉంది. దీన్ని బలవంతంగా రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అంటగట్టేందుకు చూస్తున్నారు. 2021-22లో 1,176 అరలీటర్ బాటిళ్లు, 2022-23లో 3,648 బాటిళ్లు, ప్రస్తుత ఖరీఫ్‌లో 2,246 బాటిళ్లను మాత్రమే సొసైటీలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించారు. కాంప్లెక్స్ ఎరువులు కావాలంటే నానో యూరియా బాటిల్ తీసుకోవాలంటూ నిబంధన పెట్టి మరీ పలుచోట్ల అంటగడుతున్నారు. తీసుకువెళ్లిన రైతులు వాడినా పెద్దగా ఫలితం లేకపోవడంతో దీన్ని కొనుగోలు చేసేందుకు ఇష్టపడటం లేదు. పలుకులతో కూడిన యూరియానే బాగా పనిచేస్తుందని రైతులు చెబుతున్నారు. సబ్సిడీ నుంచి తప్పుకునేందుకు నానో డిఎపిని కూడా కేంద్రం తెచ్చిన పరిస్థితి ఉంది. ఇది ఇంకా జిల్లాలోకి రాలేదని తెలుస్తోంది. నానో యూరియా వల్ల చాలా ఉపయోగాలున్నాయంటూ ఆయాశాఖల అధికారులు చెబుతున్నారు. శాస్త్రీయంగా నిరూపితంకాని నానోయూరియా వల్ల ఉపయోగాలున్నాయని ఏ విధంగా చెబుతారన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. నానో యూరియాను వాడేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. శాస్త్రీయంగా నిరూపితం కాని నానో యూరియాను రైతులకు ఇవ్వాలని చూడటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు ముందుకు రాకపోవడంతో అధికారులకు ఏంచేయాలో తెలియక మదనపడుతున్నారు. నానో యూరియాను శాస్త్రీయంగా నిరూపితమైన తర్వాత మార్కెట్లోకి తీసుకురావాలే తప్ప బలవంతంగా అంటగట్టకూడదని రైతులు అంటున్నారు.

యువగళం @ 200 రోజులు

2,700 కిలో మీటర్లు దాటిన పాదయాత్ర

సీతంపేటలో పైలాన్ ఆవిష్కరణ

యాత్రలో పాల్గొన్న తల్లి భువనేశ్వరి, నారా, నందమూరి కుటుంబ సభ్యులు

కొయ్యలగూడెంలో గిరిజనులతో ముఖాముఖీ



గిరిజన మహిళలతో లోకేష్


ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కొయ్యలగూడెం

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర గురువారం 200 రోజులు, 2,700కిలోమీటర్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలం సీతంపేటలో పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ యాత్రలో లోకేష్ తల్లి భువనేశ్వరితో పాటు నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొని నడిచారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలంలో యువగళం యాత్ర ఉత్సాహంగా



పాదయాత్రకు విచ్చేసిన లోకేష్ తల్లి భువనేశ్వరి, కుటుంబ సభ్యులు

ముందుకు సాగింది. గిరిజన మహిళలు లోకేష్‌కు రాఖీలు కట్టారు. దారిలో జనాన్ని పలకరిస్తూ, కరచాలనం చేస్తూ, ఫొటోలు దిగుతూ లోకేష్ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నరసన్నపాలెం, బయ్యనగూడెం గ్రామస్తులు తమ సమస్యలపై లోకేష్‌ను కలిసి వినతిని అందించారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు. అనంతరం కొయ్యలగూడెంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో లోకేష్ కొద్దిసేపు నృత్యం చేశారు. అనంతరం గిరిజన నాయకుడు వెంకటప్ప గిరిజనులు ఎదుర్కొంటున్న పలుసమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వంద రోజుల పాదయాత్ర సందర్భంలో చెంచులతో, 200 రోజులు పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా పోలవరంలో గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనులను ఆర్థికంగానూ, రాజకీయంగానూ ఉన్నతస్థితికి తీసుకురావడానికి టిడిపి ఎంతో కృషి చేసిందన్నారు. ఐటిడిఎలను అప్పటి సిఎం నందమూరి తారకరామారావు అని తెలిపారు. చంద్రబాబు ఎస్‌టి సబ్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేశారన్నారు. తాను పంచాయతీ రాజ్‌మంత్రిగా 500 మంది జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా గుర్తించామని తెలిపారు. రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు, ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను గిరిజనులకు అందించామని చెప్పారు.



ముఖాముఖీ నిర్వహిస్తున్న లోకేష్

గిరిజనులకు ఎన్ని చేసినా తక్కువేనన్నారు. సిఎం జగన్ అధికారంలోకొచ్చాక గిరిజనుల గొంతు కోశారని విమర్శించారు. చంద్రబాబు అరకు కాఫీ ప్రమోట్ చేస్తే, జగన్ గంజాయి ప్రమోట్ చేస్తున్నారన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. గిరిజనుల చేతిలో ఉన్న భూములను, సహజ సంపదను వైసిపి నేతలు దోపిడి చేస్తున్నారని విమర్శించారు. గిరిజనులపై వైసిపి నేతలు దాడులు చేస్తున్నారని, జగన్ 16 గిరిజన సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారని తెలిపారు. ఐటిడిఎలను నిర్వీర్యం చేశారన్నారు. గిరిజన మహిళ గుమ్మడి సంధ్యారాణికి టిడిపి హయాంలో ఎంఎల్‌సి ఇచ్చామని గుర్తుచేశారు. గిరిజనులకు మెరుగైన రాజకీయ అవకాశాలు టిడిపి కల్పిస్తుందన్నారు. గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీచేస్తామని, గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకే ఉద్యోగాలు రావాలన్నది టిడిపి విధానమని, జిఒ3ను పక్కగా అమలు చేసింది టిడిపినేనని, తెలిపారు. జిఒ3 అమలు కోసం టిడిపి పోరాడుతుందన్నారు. జగన్ ఎన్నికల ముందు గిరిజనుల కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 45 ఏళ్లు నిండిన ఎస్‌టి మహిళలకు పెన్షన్, 500మంది జనాభా దాటిన తండాలను పంచాయతీలుగా గుర్తిస్తామని చెపి మోసం చేశారని విమర్శించారు. జగన్ నిధులు, విధులు లేని కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. ఒక్క రుణం కూడా ఇవ్వలేదని చెప్పారు. టిడిపి రాగానే దామాషా ప్రకారం గిరిజన ఉపకులాలకు సబ్సిడీ రుణాలు కార్పొరేషన్ల ద్వారా ఇస్తామని ప్రకటించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే టిడిపి లక్ష్యమన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి అరకు కాఫీ తరహాలో ఇతర ఉత్పత్తులను కూడా దేశవ్యాప్తంగా ప్రమోట్ చేస్తామని, గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టే వారికి ప్రత్యేక రాయితీలిస్తామని, ఎకో టూరిజాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామన్నారు. ఫలితంగా గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు జగన్ అనేక హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. జగన్ ప్రభుత్వంలో గిరిజనులు సర్టిఫికెట్లు తీసుకోవడం కూడా కష్టంగా మారిందన్నారు. రాజకీయాల కోసం గిరిజనేతరులకు కూడా గిరిజనుల సర్టిఫికెట్లు ఇస్తున్నారని విమర్శించారు. గిరిజనులకు నష్టం లేకుండా, విబేధాలు లేకుండా బోయ, వాల్మీకుల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 2018 డిఎస్‌సి ఏర్పాటు చేశామని, ఐదేళ్ల పాలనలో రెండుసార్లు డిఎస్‌సి ప్రకటించామన్నారు. గిరిజన



లోకేష్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

టీచర్ పోస్టులన్నీ భర్తీచేశామని, మరోసారి అవకాశం ఇస్తే గిరిజన ప్రాంతాల్లో విద్యావ్యవస్థను పటిష్టపరుస్తామని తెలిపారు. యుపిపిఎస్‌సి తరహాలో ఎపిపిఎస్‌సిని కూడా బలోపేతం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్తకర్తలు పాల్గొన్నారు. శుక్రవారం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలంలో పాదయాత్ర సాగనుంది.

బిజెపి హయాంలోనే పేదలపై భారాలు

జిల్లాలో కొనసాగిన సిపిఎం సమరభేరి - ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కలిదిండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఎం సమర భేరి ప్రచారయాత్రలో బాగంగా కలిదిండిలో సంతకాల సేకరణ నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ సామాన్యులపై పెనుభారాలు మోపాయన్నారు. ప్రజాధనాన్ని ప్రభుత్వాలు కొల్లగొడుతున్నాయన్నారు. పెంచిన కరెంట్ ఛార్జీలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలను తగ్గించేవరకూ సిపిఎం దేశ వ్యాప్త ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, జె.ఏసు, పి.సత్యన్నారాయణ, పి.గోపి, జె.మహేష్ పాల్గొన్నారు.



కలిదిండిలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

కొయ్యలగూడెం: గ్యాస్ సిలిండర్ రూ.400కు, రూపాయికే యూనిట్ విద్యుత్ ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు బిజెపిని డిమాండ్ చేశారు. గ్యాస్ ధర తగ్గించడం కేవలం ఎన్నికల జిమ్మిక్కేనని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అధిక ధరలు నిరుద్యోగం విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమర భేరి కార్యక్రమాన్ని కొయ్యలగూడెం వేణుగోపాల స్వామి ఆలయం వెనుక వీధిలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మోడీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధిక ధరలను, నిరుద్యోగాన్ని నియంత్రించలేని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. కాకినాడలో లభ్యమయ్యే గ్యాస్‌ను ఇక్కడ ప్రజలకు ఇవ్వకుండా ఎక్కడో ఉన్న గుజరాత్‌కు తరలిస్తున్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ఆదేశాల మేరకే రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. దేశంలో విజన్ ఉన్న నాయకుడు నరేంద్ర మోడీ అంటున్న చంద్రబాబు మైనార్టీలపై జరుగుతున్న దాడులపై స్పందించాలన్నారు.



కొయ్యలగూడెంలో..

హామీలు ఇవ్వడం కాదు.. అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం నిర్వాసితులకు హామీలు ఇచ్చే ప్రభుత్వాలు కాదని, వాటిని అమలు చేసే ప్రభుత్వాలు కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేష్ పోలవరం నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలకు రవి స్పందించారు. ఇప్పటికైనా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం మాట్లాడడమే కాకుండా నిర్వాసితుల సమస్యలపై లోకేష్ మాట్లాడడాన్ని ఆయన స్వాగతించారు. అదే సందర్భంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హామీలు ఇవ్వడమే తప్ప వాటిని అమలు చేసిన దాఖలాలు ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. 18 ఏళ్లు ఉన్నవారికి ప్యాకేజీకి అర్హులుగా 2017ను కటాఫ్ తేదీగా ప్రకటించింది. రూ.1.15 లక్షల ప్యాకేజీని రూ.6.36 లక్షలకు పెంచింది చంద్రబాబే అయినా ఆనాడే ఆ హామీలు అమలు చేసి ఉంటే నేడు నిర్వాసితులకు ఈ గతి పట్టేది కాదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయకపోవడం వల్ల జగన్ అధికారంలోకి రావడానికి రూ.పది లక్షల ప్యాకేజీని ఇస్తానని నిర్వాసితులను మోసం చేశారన్నారు. పోలవరం నిర్వాసితులను రాజకీయ పార్టీలు తమ అధికారం కోసం హామీలు ఇచ్చి మోసం చేయడం తప్ప వారికి న్యాయం చేసింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం అవుతున్న కొద్దీ కాంట్రాక్టర్లకు ఇచ్చే డబ్బులు పెంచుతూ నిర్వాసితులకు మాత్రం ఎప్పుడో పదేళ్ల క్రితం ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తామని లోకేష్ చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ కాంట్రాక్టర్‌కు పెంచి ఇచ్చినట్లుగానే నిర్వాసితులకు కూడా నష్టపరిహార ప్యాకేజీ పెంచి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణమే తమ బాధ్యతని, నిర్వాసితుల గోడు తమకు పట్టదన్నట్లు వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం మెడలు వంచి నిర్వాసితులకు నష్టపరిహారం తెచ్చి ఇచ్చే సత్తా ఈ రాజకీయ పార్టీలకు ఉందా అని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న రాజకీయ పార్టీల హామీలకు మోసపోవద్దని, ఐక్యంగా పోరాడి తమ హక్కులు, నష్టపరిహారం సాధించుకోవాలని రవి కోరారు.

మా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి

ఐటిడిఎ పిఒను, ఎంఎల్ఎను నిలదీసిన నిర్వాసితులు



ఐటిడిఎ పిఒ, ఎంఎల్ఎలతో మాట్లాడుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తమ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని పోలవరం నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిర్వాసిత గ్రామాల్లో పర్యటించిన ఐటిడిఎ పిఒ సూర్యతేజను, ఎంఎల్ఎ తెల్లం బాలరాజును నిలదీశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోలవరం ముంపు గ్రామాలైన టేకూరు, చీడూరు, గాజుల గొంది, కొరుటురు, సిరివాక నిర్వాసిత గ్రామాల్లో ఐటిడిఎ పిఒ, ఎంఎల్ఎ తెల్లం బాలరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వారితో నిర్వాసితులు మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి ఇదే కాలనీల్లో నివాసాలు ఉంటున్నామని, తమకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో పలు సమస్యలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన భూముల్లో కూడా స్థానిక గిరిజనులు వచ్చి అడ్డుకుంటున్నారని వాపోయారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ మాట్లాడుతు మీకు కేటాయించిన భూముల్లో మీరే సాగులో ఉండేట్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ నిర్వాసితులకు ఎటువంటి సమస్య రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. గడిచిన నాలుగేళ్లుగా ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఒక్క వైసిపికే సాధ్యమైందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, వైస్ ఎంపిపి సోమగని శ్రీనివాస్, బోదా శ్రీనివాస్, నాయకులు ప్రసాద్, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరరావు, సున్నం సురేష్, తహశీల్దార్లు సుందర్‌సింగ్, సుమతి, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, ఎంఇఒ-2 బుచ్చయ్య, కె.రాము, మూలకాల బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలపై వైసిపి నేతల ఆగ్రహం

గాడిదపై లోకేష్ దిష్టిబొమ్మ ఊరేగించి నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజాపై, సిఎం జగన్‌పైనా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైసిపి నేతలు ఎంఎల్ఎ ఎలిజా ఆధ్వర్యంలో లోకేష్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగించి జంగారెడ్డిగూడెంలో నిరసన తెలిపారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం నుండి లోకేష్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగిస్తూ గంగానమ్మ గుడి సెంటర్ వరకూ కొనసాగించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. వైసిపికి చెందిన కోవర్టులు అందించిన అసత్య సమాచారాన్ని కనీసం పరిశీలించకుండా అవినీతి ఆరోపణలు గుప్పించడం లోకేష్ దిగజారుడుతనానికి నిదర్శనమని ఎంఎల్ఎ ఎలిజా ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ కార్పొరేటర్‌గా కూడా గెలవలేని పిల్లకాకి లోకేష్ అవాకులు, చవాకులు, పేలడం మానుకుంటే మంచిదన్నారు. లోకేష్‌ది యువగళం పాదయాత్రా.. లేక రౌడీల యాత్రా అని ప్రశ్నించారు. సిఎం జగన్‌ను, మంత్రులను, ఎంఎల్ఎలను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదన్నారు. పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉంటే కళ్లకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. దమ్ముంటే గతంలో ఉన్న టిడిపి మేనిఫెస్టోని బయటపెట్టాలని, కబుర్లు చెప్పడం మానుకుని నిబద్ధతగా ఉండాలని హితవు పలికారు. టిడిపి హయాంలో రోడ్ల



అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. పక్కనే టిడిపి ఇసుక దొంగలను పెట్టుకుని తమపై నిందలువేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొదమ జ్యోతి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలి : మంత్రి వనిత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ద్వారకాతిరుమలలో బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని సిహెచ్.పోతేపల్లి గ్రామంలో సోంబాబు మనవడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన వనిత మార్గం మధ్యలో ద్వారకాతిరుమలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డు మెంబర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి వనిత

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ తెలిపారు. కళాశాలలో ఆయన గురువారం మాట్లాడుతూ వృక్షశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ విభాగంలో 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు సెప్టెంబర్ ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

14న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెప్టెంబర్ 14వ తేదీన రాజభాష హిందీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏలూరులోని హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి తెలిపారు. 5, 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్, 8, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగాల్లో పాల్గొనాలని తెలిపారు. జూనియర్ విభాగంలో ఆధునిక సమాజంలో క్రమశిక్షణ పాత్ర అనే అంశంపై వ్యాసరచన, జ్ఞానార్జనలో సమాచార పత్రికల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు, సీనియర్ విభాగంలో కబీరు-వేమన సాహిత్యంలో వ్యత్యాసాలు అనే అంశంపై వ్యాసరచన, విశ్వశాంతి స్థాపనలో భారతదేశ పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. విజేతలకు హిందీ దినోత్సవం రోజున బహుమతులు, పాల్గొన్న వారందరికీ ప్రమాణపత్రం అందిస్తామని తెలిపారు. విద్యార్థులు తమ పేర్లను ఈ నెల 5వ తేదీ లోపు నమోదు చేసుకొని పవర్‌పేటలోని హిందీ నికేతన్ కార్యాలయంలో అందించాలనితెలిపారు.

ఏలూరుకు బస్సు నడపాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజల కోసం జిల్లా కేంద్రమైన ఏలూరుకు ముదినేపల్లి నుంచి ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని పిసిసి సభ్యుడు మంగినేని బాబ్జి కోరారు. గురువారం ఆయన సింగరాయపాలెంలో మాట్లాడుతూ కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేసి 16 నెలలు గడచినా జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించడంలో ఆర్‌టిసి అధికారులు చొరవ చూపకపోవడం విచారకరమన్నారు. ఏలూరుకు సరాసరి బస్సు లేక మండల ప్రజలు కైకలూరు, గుడివాడ మీదుగా మూడు బస్సులు మారి ఏలూరు వెళ్లాల్సి వస్తోందన్నారు. తక్షణమే ఆర్‌టిసి అధికారులు స్పందించి ఏలలూరు వెళ్లేందుకు ముదినేపల్లి నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని బాబ్జి కోరారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని మైలవరం రోడ్డులో బస్టాప్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను గురువారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

ముగిసిన దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ప్రజాశక్తి - ఆచంట

ప్రైమ్ 2.0 సాఫ్టవేర్ ద్వారా దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు గురువారం పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మానుష్యంగా మారాయి. ఈ సందర్భంగా ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కెసి.రాజు, సాంబశివరావు, హరి, సూర్యప్రకాష్, యడ్లపల్లి నారాయణరావు, రుద్రరాజు, చిట్టిరాజు సుధీర్ పాల్గొన్నారు.

ఆకివీడు :'మా పొట్ట కొట్టొద్దంటూ దస్తావేజు లేఖరులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. దస్తావేసు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. తరువాత కార్యక్రమం రాష్ట్ర సంఘం పిలుపుమేరకు చేస్తామని లేఖరులు తాడేపల్లి జితేంద్ర, ఎండపల్లి సుబ్బారావు తెలిపారు. నూతన విధానంలో కక్షిదారుల చేతికి దస్తావేజులు దక్కకపోవడం ఇక్కడ ప్రధానాంశమని తెలిపారు. కార్యక్రమంలో లేఖర్లు గుడిపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి అనిల్, వేము పాండురంగారావు, ఎస్.సతీష్, టి.వెంకట్, సత్యనారాయణ, ఆదూరి మురళీకృష్ణ, మాధవి, రమ్య పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెనౌడౌన్ కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్డ్ ప్రేమ్ 2.0కు వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు, శిలబోయిన సత్యనారాయణ, పట్టపు రాము, రాజేష్, కడలి శేఖర్, గుండు నాగేంద్ర పాల్గొన్నారు.

ఉండి : ఉండిలో దస్తావేజు లేఖర్ల నిరసన గురువారం రెండో రోజుకు చేరింది. పలువురు దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ దస్తావేజు లేఖర్ల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఇదే వృత్తిని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా లక్షలాదిమంది జీవనం సాగిస్తుండగా వారిని రోడ్డుపై పడేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చే 2.0 విధానాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో దస్తావేజు లేఖర్లు, సహాయకులు, డిటిపి ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లందరూ ఐక్యంగా ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు, సహాయకులు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

జిఒ 107, 108ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేద మెరిట్ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు తీసుకొచ్చిన జిఒ 107, 108ను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సుందర్, టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. గురువారం డిఎన్ఆర్ కళాశాల కూడలిలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టి.అప్పలస్వామి, సిహెచ్ సుందర్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 శాతం ఎంబిబిఎస్ సీట్లను కన్వీనర్ కోటాలో కేటాయించి మరో 50 శాతం సీట్లను బి, సి కేటగిరీలుగా విభజించి లక్షల రూపాయలకు అమ్ముతూ ఈ ప్రభుత్వం వైద్య విద్యను పూర్తిస్థాయిలో వ్యాపారం చేసిందని విమర్శించారు. ఇలా చేయడం వల్ల ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదిక కేటాయించే వైద్య సీట్లు దగ్గే ప్రమాదముందని తెలిపారు. ఆపై ఈ వర్గాల విద్యార్థులు వైద్య విద్యకు దూరమౌతారన్నారు. 100 శాతం సీట్లను కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని వైద్య విద్యను, వ్యాపారం చేయడం కోసం తీసుకొచ్చిన జిఒ 107, 108ను తక్షణం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కారుమంచి మనోజ్, పి.పవన్, అంజి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి యువకుడు మృతి

ప్రజాశక్తి - ముసునూరు


నాగరాజు (ఫైల్‌ఫోటో)

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చక్కపల్లి గ్రామానికి చెందిన మానికల నాగరాజు (26) బి టెక్ పూర్తి చేసుకుని గుజరాత్‌లో ఉద్యోగం చేసేవాడు. సెలవులు కావడంతో రెండు నెలల క్రితం చక్కపల్లి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన నాగరాజును అతని తండ్రి గొర్రెల కాపాలకి వెళ్లమని చెప్పారు. నాగరాజు వెళ్లననడంతో తండ్రి మందలించి పంపించాడు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటినుంచి విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

కట్నం వేధింపులపై ముసునూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన వీరాంజనేయులుకు, టి.నరసాపురం మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన పుష్పకు పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో సంవత్సరం నుంచి తన భర్త అదనపు కట్నం తీసుకురావాలని తనని వేధిస్తున్నాడని పుష్ప గురువారం ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎం.కుటంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

వర్షాభావంతో రైతుల్లో ఆందోళన

ఎండిపోతున్న పత్తి, వరి పంటలు

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాలు పడకపోవడంతో 15 రోజుల నుంచి పత్తి, వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోందని వర్షాధారంపై ఆధారపడిన రైతులు దిగాలు చెందుతున్నారు. 15 రోజుల క్రితం వర్షాలు పడి మళ్లీ జాడ లేకుండాపోయింది. వరుణుడు పూర్తిగా ముఖం చాటేయడంతో వరి పంటల పరిస్థితి దారుణంగా కనిపిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని రూ.16 వేల ఎకరాల్లో వరిపంట వేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. నీరు లేకపోవడంతో వరినార్లు ఎండిపోతున్నాయని వర్షాధారంపై ఆధారపడిన రైతులు వాపోతున్నారు. మరో 15 రోజులు వర్షం కురవకపోతే ఎండల తీవ్రత మరింత పెరిగితే పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు బోరుబావులు ఉన్న రైతులకు ప్రభుత్వం 24 గంటలు కరెంటు సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ మండలంలో అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. వర్షం



రాకుంటే మండలంలో కొన్ని వందల ఎకరాల్లో పంటలు నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన

5కె రెడ్‌రన్‌ను ప్రారంభించిన ఆర్‌డిఒ పెంచల కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన కలిగించేందుకు 5కె రెడ్ రన్‌ను నిర్వహించినట్లు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్ చెప్పారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఇండోర్ స్టేడియం నుంచి "నేషనల్ యూత్ ఫెస్ట్ - 2023" కార్యక్రమంలో భాగంగా '5 కె రెడ్ రన్' (5కిమీ పరుగు) కార్యక్రమాన్ని ఆర్‌డిఒ పెంచల కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ మారథాన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, దుంపగడప, పాలకొల్లు ప్రాంతాల్లో ఉన్న రెడ్ రిబ్బన్ క్లబ్స్ కలిగిన డిగ్రీ కళాశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.రత్నకుమారి మాట్లాడుతూ ఈ 5 కె రెడ్‌రన్‌లో ఏలూరు జిల్లా నుంచి పాల్గొన్న వారిలో స్థానిక సర్‌సిఆర్.రెడ్డి కళాశాలకు చెందిన బి.మోహన్, పి.సాయిరామ్ మొదటి, ద్వితీయ స్థానాలు గెలుపొందగా ఏలూరు కోటదిబ్బ డిగ్రీ కళాశాల విద్యార్థి పి.సాయికుమార్ తృతీయ స్థానం సాధించారన్నారు. అదేవిధంగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పాల్గొన్న వారిలో తణుకు డిగ్రీ కళాశాల విద్యార్థులు యేసు సత్య, హిమేష్‌కుమార్‌లు మొదటి, తృతీయ స్థానాలను కైవశం చేసుకోగా, తాడేపల్లిగూడెం పెంటపాడు డిగ్రీ కళాశాల విద్యార్థి మోహన్‌కుమార్ ద్వితీయ స్థానాన్ని సాధించారన్నారు. వీరితో పాటు సర్ సిఆర్ రెడ్డి కలశాల, ఏలూరు కోటదిబ్బ డిగ్రీ కళాశాల, జంగారెడ్డిగూడెం డిగ్రీ కళాశాల, తణుకు డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం, పెంటపాడు డిగ్రీ కళాశాల, పాలకొల్లు డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు ప్రతి జిల్లా నుంచి ప్రథమ బహుమతి కింద రూ.పది వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.ఏడు వేలు, తృతీయ బహుమతి కింద రూ.ఐదు వేల నగదు పారితోషికాన్ని సెప్టెంబర్ నెల రెండో వారంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో అందించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈ విజేతలను తదుపరి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు చెప్పారు. వీరితోపాటు ప్రతి జిల్లా నుంచి మరో ఏడుగురికి కన్సోలేషన్ కింద రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ డి.కిషోర్, జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కుసుమకుమారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్లు, రెడ్ రిబ్బన్ క్లబ్స్ కో-ఆర్డినేటర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్

ప్రజాశక్తి - ఏలూరు

అనుబంధాలను పెంచుతూ బాధ్యతలను గుర్తుచేసే వేదిక రక్షాబంధన్ అని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. రక్షా బంధన్ పురస్కరించుకుని స్థానిక కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ రాఖీ కట్టారు. తొలుత జెడ్‌పి చైర్‌పర్సన్ దంపతులు గంటా పద్మశ్రీ, గంటా ప్రసాద్ కలెక్టర్ వారి బంగ్లాకు రాగా వారికి కలెక్టర్ దంపతులు ప్రసన్నవెంకటేష్, డాక్టర్ మానస ఆప్యాయతగా స్వాగతం పలికి రక్షాబంధన్ శుభాభినందనలు తెలిపారు. రక్షా బంధన్ సందర్భంగా రాఖీ కట్టిన జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీకి కలెక్టర్ దంపతులు నూతన వస్త్రాలు బహూకరించారు.

రాఖీ కట్టడం ద్వారా శాంతి, సార్వత్రిక సౌభ్రాతృత్వ సందేశాన్ని అందిస్తున్న బ్రహ్మకుమారి సోదరీమణులు అభినందనీయులని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రాజయోగిని, బికె.లావణ్య, రాజయోగ టీచరు బికె.మమత రాఖీలు కట్టి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను పాటించడం ద్వారా విలువలను పరిరక్షించవచ్చన్నారు. బ్రహ్మకుమారీస్‌కు కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి బికె.నరసింహరావు, వ్యాపార వేత్త బికెఎస్ఎన్ పాత్రుడు పాల్గొన్నారు.

పెదపాడు మండలంలోని అప్పనవీడుకు చెందిన ఆశా జ్యోతి విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ పురస్కరించుకుని స్థానిక కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పలువురు చిన్నారులు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి కాసేపు పిల్లలతో ఆప్యాయతగా ముచ్చటించారు. చిన్నారులకు చాక్లెట్లు, మిఠాయిలు అందించారు. విభిన్న ప్రతిభావంతులైనప్పటికీ ఏమాత్రం కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఆత్మీయుల మధ్య ఐక్యమత్యానికి పరస్పర చిహ్నంగా రాఖీ పౌర్ణమి, రక్షాబంధన్ పండుగ చేసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సొసైటీ డైరెక్టర్ ఎం.మాధవీలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో గురువారం రాఖీ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ భాగవతుల హేమలత మాట్లాడుతూ సోదర, సోదరీమణుల బంధానికి ప్రతీకగా రాఖీపూర్ణిమ నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సోదరీమణుల సంరక్షణ వారి ఆనందం సంతోషం సోదరులందరి బాధ్యతని ఆమె అన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా విఘ్నేష్, శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా కూనపాముల విఘ్నేశ్వరరావు, కార్యదర్శిగా భజంత్రి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా తోర్లపాటి బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన అధ్యక్ష కార్యదర్శులు విఘ్నేష్, శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ బుధవారం స్థానిక సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విఘ్నేష్, శ్రీనివాస్ తెలిపారు. కోశాధికారిగా ముత్యాల నాగేంద్రరావు, ఉపాధ్యక్షులుగా దొడ్డిగర్ల నాగబాబు, సహాయ కార్యదర్శిగా బొక్కా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా మరో 12 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆహ్వానితులుగా మడుగుల జగదీష్, పొడుదోలు రమణ, వడిత్య బాలులను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమ బద్ధీకరిం చాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్మానించారు. ఆప్కాస్, అవుట్ సోర్సింగ్ కార్మికులు రిటైర్డ్ అయినా, విధి నిర్వహణలో మరణించినా వారి స్థానాలను తక్షణమే భర్తీ చేయాలని తీర్మానించారు. కార్మికులపై పని భారం తగ్గించాలని, కరోనా సమయంలో చనిపోయిన కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించి అమలు చేయాలని, క్యాప్ ఆటో డ్రైవర్లకు కాంట్రాక్ట్ కాకుండా రెగ్యులర్‌గా గుర్తించాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల కోసం పర్యవేక్షణ కమిటీ

సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాష్

ఏలూరు : ఏలూరు జిల్లా పరిధిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులను (సఫాయి కర్మచారి) గుర్తించి, వారి పునరావాసం కోసం చట్టంలోని నిబంధన లను అమలు చేయడం, వారి పురోగతి పరిశీలన నిమిత్తం జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు కమిటీలో పారిశుద్ధ్య కార్మికులు (సఫాయి కర్మచారి)లకు చెందిన సామాజిక కార్యకర్తలను గాని పారిశుద్ధ్య కార్మికులు (సఫాయి కర్మచారి) కమ్యూనిటీకి చెందిన ప్రతినిధులను ఐదు మందిని సభ్యులుగా నియమించేందుకు చట్టంలోని సెక్షన్ 24, 26 ప్రకారం ఆవకాశం ఉందన్నారు. సదరు కమిటీ సభ్యుల కాల పరిమితి రెండేళ్లు మాత్రమేనన్నారు. సదరు కమిటీ ఏర్పాటు నిమిత్తం పారిశుద్ధ్య కార్మికులు (సఫాయి కర్మచారి)లకు చెందిన సామాజిక కార్యకర్తలు గాని పారిశుద్ధ్య కార్మికులు (సఫాయి కర్మచారి) కమ్యూనిటీకి చెందిన ప్రతినిధుల అభ్యర్థుల నుంచి సభ్యులుగా నియమించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు ఫారములు సంయుక్త సంచాలకులు వారి కార్యాలయంలో తీసుకుని పూర్తి చేసి తగిన ధ్రువపత్రాలతో ఈ నెల పదో తేదీలోగా పైని తెలిపిన కార్యాలయంలో అందించాలని తెలిపారు. వివరాలకు 9618260778, 9381607699 సంప్రదించాలని తెలిపారు.

రహదారి విస్తరణ పనులతో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


ముదినేపల్లి వైకూడలి వద్ద స్తంభించిన ట్రాఫిక్

మండల కేంద్రమైన ముదినేపల్లిలో ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయాయి. పామర్రు- దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో ముమ్మరంగా జరుగుతున్నాయి. వైకూడలి వద్ద కాంట్రాక్టర్ డ్రెయినేజీల నిర్మాణ పనులు మొదలుపెట్టాడు. పాత రోడ్డు వెంబడి డ్రెయినేజీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పొక్లెయిన్ మట్టిని తవ్వి రోడ్డు మార్జిన్లల్లో వేస్తుంది. అలాగే డ్రెయినేజీ నిర్మాణాల కోసం తవ్విన గుంతల్లో ఊరిన ఊట, వర్షపు నీటిని పైపుల ద్వారా కార్మికులు రహదారిపైకి వదులుతున్నారు. దీంతో రహదారంతా బురదమయంతో అధ్వానంగా మారుతోంది. ఈ కారణంగా సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ స్తంభించిపో వడంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో విస్తరణ పనులు జరుగుతున్న కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదా రులు, ప్రజలు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారాయి. సదరు కాంట్రాక్టర్ అధికారుల సూచనలు, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, పంచాయతీ కార్యదర్శి సారధి చేసే సలహాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా, అడ్డదిడ్డంగా పనులు చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు రహదారిపై రాకపోకలు సాగించేందుకు నానా తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు వైకూడలి వద్ద రోడ్డు మార్జిన్లల్లో రహదారికి ఇరువైపులా హోటళ్లు, కొబ్బరిబొండాల దుకాణాలు, పానీపూరి దుకాణాలు, పూలకొట్లు, కూరగాయల తదితర వ్యాపారాలు నిర్వహి స్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎదురెదురుగా రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేకుండా పోయింది. ఉదయం, సాయంత్రం వేళ్లల్లో ట్రాఫిక్ మరింత స్థంభిస్తుంది. దీంతో తరచూ వాహనదారులకు, దుకాణదారులకు వాగ్వివాదాలు జరుగుతున్నాయి. పలుసార్లు ప్రమాదాలు జరుగుతున్నాం ఎ. కొందరు వ్యక్తులు తమ బైక్‌లను కూడా రోడ్డు మార్జిన్లల్లో పార్కు చేయడం వంటి కారణాలు కూడా ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నాయి. అదేవిధంగా సోమవారం సంత రోజున గురజ రోడ్డు సెంటర్‌లో స్తంభిస్తున్న ట్రాఫిక్‌తో ప్రజలు, వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. ఇక్కడ కూరగాయల దుకాణాలపైకి కూడా వాహనాలు దూసుకెళ్తున్నాయి. దీంతో కూరగా యలు ధ్వంసం అవుతున్న సంఘటనలు కూడా తరచూ చోటు చేసుకుంటున్నాయి. దీంతో వాహన దారులకు , కూరగాయల దుకాణాదారు లకు ఘర్షణలు కూడా జరుగుతున్నాయి. తీవ్ర ట్రాఫిక్ వల్ల గురజ రోడ్డు సెంటర్‌లో పలు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇదంతా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడంలేదంటూ, ట్రాఫిక్ నియంత్రణ చేయడం లేదంటూ వాహనచోదకులు, ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్‌పై దృష్టి పెట్టి ప్రజలకు, వాహనచోదకులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వైసిపి నేతలవి వికృత చేష్టలు : టిడిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి నేతలు ఎంఎల్ఎ ఎలిజాతో కలిసి గాడిద మీద లోకేష్ ఫొటో పెట్టి ప్రదర్శన చేయడం దుర్మార్గమైన వికృత చేష్టలకు నిదర్శనమని టిడిపి నేతలు అన్నారు. గురువారం గంగానమ్మ గుడి సెంటరు వద్ద పసుపు నీళ్ల చల్లి లోకేష్ చిత్రపటానికి క్షీరభిషేకం చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషును పోలీసులు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించగా టిడిపి నేతలు పోలీసు వాహనాన్ని అడ్డగించి నిలువరించారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్ మాట్లాడుతూ ఎప్పుడూ లేని విష సంస్కృతిని వైసిపి నాయకులు తీసుకువస్తున్నారన్నారు. రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు మాట్లాడుతూ వైసిపి నేతలు లోకేష్ చిత్రపటాన్ని గాడిదపై ఊరేగించడం దుర్మార్గమన్నారు. మాజీ ఎంఎల్ఎ గంటా మురళి మాట్లాడుతూ వైసిపి హయాంలో జరిగిని అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీలు చేసే వాటికి ప్రభుత్వంలో ఉన్నవారు ఈ విధంగా చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు సాయల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి తుటికుంట రాము, నాయకులు, పెనుమర్తి రామ్ కుమార్, బొమ్మాజీ అనిల్, పరిమి సత్తిపండు, రాజన పండు, ఆలపాటి నాని, షేక్ నజీర్, షేక్ యాకుబ్, లీల ప్రశాంతి, గంటా శ్రీను, నత్త నాగేంద్ర, గోరింక దాసు, గుల్లపూడి శ్రీదేవి, ఆకుల రాజేష్, దండే గాంధీ, ముళ్లపూడి శ్రీనివాస్, వైట్ల ఆంజనేయులు, రాగాని శ్రీను, త్రిమూర్తులు, తాళ్లూరి వెంకటేష్, తోట కృపావరం, నాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపాలని వినతి

ప్రజాశక్తి - ముసునూరు

తమకు 2018లో పట్టాలు ఇచ్చారని, కాని ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపించలేదని మండలంలోని చక్కపల్లి గ్రామస్తులు కోరారు. తమకు ఇళ్ల స్థలాలు చూపించాలని కోరుతూ గ్రామస్తులు తహశీల్దార్ దాసరి సుధకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెక్కపల్లి గ్రామానికి చెందిన 46 మందికి 2018లో టిడిపి హయాంలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు పట్టాలిచ్చారని, స్థలాలు చూపించలేదన్నారు. దీనిపై బుధవారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్‌ను కలిశామని తెలిపారు. సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో అర్జీ అందిస్తే పాత లబ్ధిదారులందరికి స్థలం చూపుతానన్నారని తహశీల్దార్‌కి ఈ సందర్భంగా తెలిపారు.

టిడిపి హయాంలో రూ.170 కోట్లతో టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి హయాంలో నూజివీడు పట్టణంలో రూ.170 కోట్లతో టిడ్కో ఇళ్లను నిర్మించినట్లు టిడిపి నేత యనమదల సత్యనారాయణ (నాని) అన్నారు. నూజివీడు టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం, సీసీ రోడ్లు, ఎల్ఇడి లైట్లు, మల్లవల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ టిడిపి పాలనలో అభివృద్ధి చెందినట్లు చెప్పారు. వైసిపి పాలనలో మల్లవల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎందుకు మూతపడిందో చెప్పాలన్నారు. మళ్లీ టిడిపి ప్రభుత్వం వస్తే పూర్వవైభవాన్ని తీసుకొస్తామని చెప్పారు.

ఐలును ఆదరించాలి

ప్రజాశక్తి - ఏలూరు

న్యాయవాదుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు)ను ఆదరించాలని ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి కోరారు. ఏలూరు నగర ఐలు మహాసభ పి.వెంకట అధ్యక్షతన కోర్టు ప్రాంగణంలోని న్యాయవాద గుమస్తాల సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మహాసభకు అతిథులుగా ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మునిస్వామి, ఐలు మహిళా న్యాయవాదుల రాష్ట్ర కన్వీనర్ ఓరుగంటి శైలజ హాజరయ్యారు. మహాసభలో తొలుత కామన మునిస్వామి మాట్లాడుతూ ఐలు జూనియర్ న్యాయవాదుల ప్రయోజనాల కోసం, న్యాయ వాదులకు రాజ్యాంగం, చట్టాల పట్ల అవగాహన కలిగించడానికి సదస్సులు, మోడల్ టెస్టులు నిర్వహిస్తూ సామాజిక సమస్యలపై అవగాహన పెరగడానికి దోహదం చేస్తోందని, న్యాయవాదులను భాగస్వామ్యం చేస్తుందని వివరించారు. ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఐలు కృషి చేస్తుందన్నారు. ఏలూరులో గత 30 సంవత్సరాలుగా వివిధ కార్యక్రమాలు చేపట్టి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయభాస్కర్ కార్యకలాపాల నివేదికను వివరించారు. మహాసభలో నూతన కమిటీ అధ్యక్షులుగా పి.వెంకట్, కార్యదర్శిగా గెద్దా విజయభాస్కర్, కమిటీ సభ్యులుగా పి.పరమేశ్వ రరావు, వి.శైలజ, ఎస్ఎన్ కట్టా, రమేష్‌బాబు, ఎ.శిరీష, కె.మోహనచంద్ర, సతీష్, జె.గంగా ఫణీంద్ర లక్ష్మి ఎన్నికయ్యారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, జూనియర్ న్యాయవాదులందరికీ ఐదేళ్ల పాటు నెలకు రూ.పది వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్ అందించాలని, జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం వృత్తి శిక్షణ కల్పించాలని, ఏలూరు కోట దిబ్బలోని ఫోక్సో కోర్టును అమీనా పేటలోని హాస్టల్స్ ప్రాంగణంలోకి మార్చాలని ఐలు నగర మహాసభ తీర్మానంలో డిమాండ్ చేసింది.

టిడిపి నేతల సంబరాలు

చాట్రాయి : యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని పర్వతాపురంలో టిడిపి గ్రామ యూత్ ఆధ్వర్యంలో మోరంపూడి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న కాలంలో టిడిపికి పటిష్ట నాయకత్వం అందించగల సర్వ సమర్థుడు లోకేష్ అని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఐటి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా లోకేష్ ప్రతిభావంతంగా పనిచేసి ఎన్నో అవార్డులు అందుకున్నారని ప్రశంసించారు. మంత్రిగా రూ.25 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఎల్ఇడి లైట్లు వేయించిన ఘనత లోకేష్‌దేనన్నారు.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 542/2019, ఓ.ఎస్.నెం. 24/2014

బిట్వీన్:

శ్రీమతి బుర్రా పూర్ణిమ
...పిటీషనరు /ప్రపోజ్డ్ పార్టీ

అండ్

రాట్నాల శ్రీనివాసరవు వగైరా
...వాది /రెస్పాండెంట్లు

టు:

ఆర్-8: మెరగాని పావని శ్రీలత, భర్త: శ్రీనివాసు, వయస్సు 42 సంగలు, స్త్రీధనం.

ఆర్-9: కామినేని మీనామాన్వి, వయస్స 25 సంగలు, స్త్రీ ధనం.

ఆర్-10: మెరగాని హితైషి, తండ్రి: లేటు శ్రీనివాసరావు, వయస్స 22 సంగలు, సాగ8-10, ఫ్లాట్ నెం.302, భాస్కర హైట్ అపార్ట్‌మెంట్, విద్యా నగర్, ఏలూరు ఇ.జె.సి.జె.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు ప్రతివాదిగా చేర్పించమని కోరగా సదరు పిటీషనులో మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. సదరు పిటీషను శ్రీ కోర్టు వారు **ది.04-09-2023 సంగరం తేదీకి వాయిదా వేసినారు. ఆరోజున మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని ఉదయం గంగ10:30 నిగలకు కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

పి.జె.పి. కెనడి
పిటీషనరు తరుపు అడ్వకేట్,
బాతనీపేట, భీమవరం.
సెల్: 93473 04911

భీమవరం,
30-8-23.